క్లుప్తంగా

రూ.91 వేలు పలికిన గణనాథుడి లడ్డు


రాజంపేట టౌన్‌: లడ్డును అందుకుంటున్న నాగేంద్ర, రామలక్ష్మణ్‌ సోదరులు

రాజంపేట టౌన్‌ : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని చుండు వారిపల్లెలో గణనాథుడి లడ్డు రూ.91 వేలు పలికింది. ఆ గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు వినాయకుడి లడ్డును వేలం వేయగా అక్కడి ప్రజలు వేలం పాటలో పోటాపోటీగా పాల్గొన్నారు. చివరికి చుండు నాగేంద్ర, రామలక్ష్మణ్‌ సోదరులు రూ.91 వేలకు లడ్డును కైవసం చేసుకున్నారు.


లడ్డును దక్కించుకున్న సూరం వెంకటసుబ్బారెడ్డి

రామాపురం : మండలంలోని నల్లగుట్టపల్లి గ్రామం కొత్తపల్లిలో వినాయక నిమజ్జనంలో భాగంగా బుధవారం లడ్డు వేలం పాటను నిర్వహించారు. నల్లగుట్టపల్లి ఎంపీటీసీ సూరం నాగభూషణమ్మ , సూరం వెంకటసుబ్బారెడ్డిలు రూ.30,116కు లడ్డును వేలం పాటలో దక్కించుకున్నారు. అనంతరం గ్రామస్తులు విజయోత్సాహం నడుమ వారిని ఇంటి వద్దకు తీసుకెళ్లారు.

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న


అన్నదానం చేస్తున్న వైస్‌ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషణరెడ్డి

గాలివీడు : అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న అని వైస్‌ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌ వద్ద కొలువై ఉన్న వినాయకుడి ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాతల సహకారంతో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దాదాపు 2 వేలమందికి అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ–2 గాలి శ్రీనివాసులు, కాపు నాయకులు తంగాల వేణుగోపాల్‌, వైఎస్సార్‌సీపీ నాయకులు విశ్వనాథ రెడ్డి, సుబ్బారెడ్డి, నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ


క్రీడా దుస్తులు అందజేస్తున్న సుబ్బరాజు

పుల్లంపేట : పుల్లంపేట మండలం, వత్తలూరు జిల్లాపరిషత్‌ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వత్తలూరు గ్రామానికి చెందిన ఎస్‌. వెంకట సుబ్బరాజు బుధవారం క్రీడా దుస్తులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో రక్తదానం


రక్తదానం చేస్తున్న తిరుమల అనిల్‌కుమార్‌

రాయచోటి అర్బన్‌ : ఆపదలో ఉన్న నిండు గర్భిణికి బుధవారం లయన్స్‌క్లబ్‌ ఆధ్వర్యంలో రక్తం అందించారు. పట్టణానికి చెందిన విజయలక్ష్మి అనే గర్భిణికి రక్తం అత్యవసరం కాగా లయన్స్‌క్లబ్‌ సభ్యుడు తిరుమల అనిల్‌కుమార్‌ స్పందించి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు హరినాథ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన ప్రతిఒక్కరూ 3 నెలలకు ఒక్కసారి కచ్చితంగా రక్తదానం చేయడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో క్లబ్‌ కార్యదర్శి ఇందాద్‌, కోశాధికారి హరీష్‌, దీప బ్లడ్‌బ్యాంక్‌ మేనేజర్‌ ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై దాడి చేసిన వారిని అరెస్ట్‌ చేయాలి

కడప సెవెన్‌రోడ్స్‌ : ప్రకాశం జిల్లా సంతనూతలపాడు తహసీల్దార్‌ లక్ష్మీనారాయణరెడ్డిపై దాడికి పాల్పడ్డ వ్యక్తిని అరెస్ట్‌ చేయాలని ఏపీ రెవెన్యూ సర్వీసెస్‌ అసోసియేషన్‌(అమరావతి) జిల్లా అధ్యక్షుడు ఆర్‌. జీవన్‌ చంద్రశేఖర్‌, ప్రధాన కార్యదర్శి అలీఖాన్‌ కోరారు.

గణనాథునికి ఘనంగా వీడ్కోలు

వినాయక చవితి మహోత్సవాలలో భాగంగా మూడవ రోజు బుధవారం గణనాథునికి ఘనంగా వీడ్కోలు పలికారు. వినాయకుని ప్రతిమలను డప్పు వాయిద్యాల మధ్య నిమజ్జనానికి తరలించారు. యువకులు, మహిళలు కోలాహలంగా నృత్యాలు చేసుకుంటూ నిమజ్జనంలో పాల్గొన్నారు. పోలీసులు నిమజ్జన ప్రాంతాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– సాక్షినెట్‌వర్క్‌


రైల్వేకోడూరు అర్బన్‌:నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు


ఓబులవారిపల్లె:గోవిందంపల్లె చెరువులో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న యువకులు


లక్కిరెడ్డిపల్లి: నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు


రాజంపేట టౌన్‌: గంగ ఒడికి తరలుతున్న గణనాథుడు


సిద్దవటం:వినాయక విగ్రహాలు నిమజ్జనానికి ఊరేగింపుగా పెన్నానది వద్దకు వచ్చిన దృశ్యం


సంబేపల్లి మండలంలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణేశుడు


చిన్నమండెం: శ్రీనివాసపురం రిజర్వాయర్‌ వద్ద బందోబస్తు విధుల్లో పోలీసులు


రైల్వేకోడూరు: కొత్తబజారులో ఉట్టికొడుతున్న దృశ్యం


రామాపురం: నిమజ్జనానికి తరలిస్తున్న వినాయక ప్రతిమలు


రైల్వేకోడూరు:పట్టణంలో నిమజ్జనానికి ఊరేగింపుగా వస్తున్న గణనాథుడు

‘అన్నమయ్య’డ్యాం దిగువ ప్రాంత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

నందలూరు(రాజంపేట) : గాలేరు–నగరి కాలువతో అన్నమయ్య జలాశయం దిగువ ప్రాంతానికి సాగు, తాగు నీటి సౌకర్యం కల్పించే దిశగా చర్యలు చేపట్టనున్నారు. ఈ మేరకు బుధవారం నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి జీఎన్‌ఎస్‌ఎస్‌ అధికారులతో సమావేశమయ్యారు. ఎంపీపీ చాంబర్‌లో జరిగిన ఈ సమావేశంలో అన్నమయ్య ప్రాజెక్టు ఈఈ రవికిరణ్‌, డివిజన్‌ ఇంజినీర్‌ మురళీకృష్ణ, అధికారులు బాలసుబ్రమణ్యంరెడ్డి, జయచంద్రారెడ్డి, ఏఈలు పరశురామయ్య, ఓబులేసు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఎంపీపీ విలేకరులతో మాట్లాడుతూ అన్నమయ్య డ్యాం వల్ల దిగువ ప్రాంతానికి దశాబ్దాలుగా నీటి విడుదల విషయంలో అన్యాయం జరుగుతోందన్నారు. అందువల్ల అన్నమయ్య డ్యాం పునర్‌ నిర్మాణ సమయంలో మరోసారి అన్యాయం జరగకుండా దిగువ ప్రాంతానికి లెఫ్ట్‌ కెనాల్‌ నిర్మించాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ద్వారా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డికి విన్నవించామన్నారు. ఇందులో భాగంగానే అన్నమయ్య డ్యాం, జీఎన్‌ఎస్‌ఎస్‌ అధికారులు లెఫ్ట్‌ కెనాల్‌ ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను వివరించారన్నారు. ఇందులో భాగంగా జీఎన్‌ఎస్‌ఎస్‌ కాలువ ప్యాకేజీ 5వ చివరి భాగం చెయ్యేరు ఆక్వాడెక్టు దగ్గర నుంచి ప్రాంత ఆయకట్టు గ్రావిటీ ద్వారా 1.00 టీఎంసీ నీరు కేటాయించి అదనపు పంపిణీ, ఆఫ్‌టేక్‌ కేటాయించడం ద్వారా దిగువ ప్రాంత నీటి సమస్య తీరే అవకాశం ఉందన్నారు. ఈమేరకు సంబంధిత శాఖల ద్వారా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపనున్నామన్నారు.


ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డికి ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను వివరిస్తున్న అధికారులు

ఉపాధ్యాయుల చేతిలోనే దేశ భవిష్యత్తు

సంబేపల్లి : దేశ భవిష్యత్తు రూపుదిద్దుకునేది పాఠశాలల్లోనే అని, అందుకు ఉపాధ్యాయులే కీలకపాత్ర పోషిస్తున్నారని రాయచోటి ఉప విద్యాశాఖ అధికారి వరలక్ష్మి అన్నారు. సంబేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో బుధవారం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఓబుల్‌ రెడ్డికి సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ విద్యాపరంగా, సామాజికపరంగా ఉత్తమ సేవలు అందించినప్పుడే ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు సామాజిక స్పృహ, శాస్త్రీయత గురించి నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, డీఈఓ కార్యాలయ ఏడీ ప్రసాద్‌ బాబు, సీఎంఓ కరుణాకర్‌, ఏఎస్‌ఓ నాగేంద్ర రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్‌ శ్రీనివాసరాజు, కిరణ్‌ కుమార్‌ రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రతాప్‌ రెడ్డి, సర్పంచ్‌ రామచంద్ర, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌ వాసుదేవరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఓబుల్‌ రెడ్డి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో వ్యవహరించాలి

రాయచోటిటౌన్‌ : విద్యార్థులు ఆటల పోటీలలో క్రీడా స్ఫూర్తితో వ్యవహరించాలని ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామ్మోహన్‌ రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటి నియోజక వర్గ స్థాయి స్కూల్‌ గేమ్స్‌ క్రీడల నిర్వహణలో భాగంగా వాలీబాల్‌, షటిల్‌, త్రోబాల్‌ వంటి క్రీడలను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలలో గెలుపోటములు సర్వసాధారణమన్నారు. వాలీబాల్‌ క్రీడలో గాలివీడు జట్టు విన్నర్స్‌గా, చిన్నమండెం జట్టు రన్నర్స్‌గా నిలిచారు. అలాగే త్రోబాల్‌లో రామాపురం జట్టు విన్నర్స్‌గా, గాలివీడు జట్టు రన్నర్స్‌గా నిలిచారు. షటిల్‌లో సంబేపల్లె మండలం విన్నర్స్‌, చిన్నమండెం మండలం రన్నర్స్‌గా నిలిచారు. ఈ క్రీడలను కో ఆర్డినేటర్లు జగదీశ్వరయ్య, నరసరాజు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్‌ జిల్లా కార్యదర్శి జాబీర్‌, ప్రధానోపాధ్యాయురాలు సైరాబాను తదితరులు పాల్గొన్నారు.


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న పీఈటీలు, ఉపాధ్యాయులు

బాలికోన్నత పాఠశాలలో..

బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్‌ గేమ్స్‌ క్రీడలలో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

ఎస్పీ కృష్ణారావుతో రాజంపేట ఎమ్మెల్యే మేడా భేటీ

రాజంపేట: జిల్లా ఎస్పీ కృష్ణారావును రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి బుధవారం ఆయన చాంబరులో కలిశారు. ఇటీవల ఎస్పీగా నూతన బాధ్యతలను తీసుకున్న నేపథ్యంలో తొలిసారిగా ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు వీరనాగిరెడ్డి, గడికోట రాజీవ్‌రెడ్డి, జనార్దన్‌ రెడ్డి, సత్యాల రామకృష్ణ తదితరులు ఉన్నారు.


జిల్లా ఎస్పీ కృష్ణారావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

ఈ–పంట నమోదును పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి

పెనగలూరు: మండలంలో ఈ–పంట నమోదును జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రనాయక్‌ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఈ–పంటను నమోదు చేసుకోవాలన్నారు. పంట నమోదు ఆధారంగానే రైతు భరోసా, సున్నావడ్డీ, నష్టపరిహారం, ఇతర ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. అనంతరం ఎరువుల నిల్వలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.


ఈ–పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రనాయక్‌

రేపు సిద్దవటంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం

సిద్దవటం : సిద్దవటంలోని తహసీల్దార్‌ కార్యాలయంలో ఈనెల 22వ తేదీన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. జిల్లా కలెక్టర్‌ విజయరామరాజుతో పాటు అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, డివిజన్‌ అధికారులు, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కారం పొందవచ్చన్నారు.

మహిళలకు రిజర్వేషన్‌ శుభపరిణామం

పోరుమామిళ్ల : చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం శుభ పరిణామమని బీజేపీ బద్వేలు అసెంబ్లీ కన్వీనర్‌ ఉట్టి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని కళాశాలల్లో విద్యార్థినులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయంగా మహిళలు ఉన్నత స్థితిలో ఉండాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్‌ అమలు చేస్తోందన్నారు. కాగా మహిళా రిజర్వేషన్‌ అమలు చేయడం చరిత్రాత్మక నిర్ణయమని జిల్లా సామాజిక సమరసత ప్రముఖ్‌ బాలరంగయ్య పేర్కొన్నారు.

హెచ్‌పీసీఎల్‌లో మాక్‌ డ్రిల్‌

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న హిందుస్థాన్‌ పెట్రోలియం కార్పొరేషన్‌ లిమిటెడ్‌లో బుధవారం మాక్‌ డ్రిల్‌ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కర్మాగారం డిప్యూటీ చీఫ్‌ ఇన్స్‌పెక్టర్‌ కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా పెట్రోల్‌ పైప్‌లైన్‌లో, పెట్రోల్‌ ట్యాంకర్‌లో మంటలు వ్యాపించినప్పుడు సైరన్‌ మోగడంతో సిబ్బంది అప్రమత్తమై మంటలను ఆర్పే సన్నివేశాన్ని ప్రదర్శించారు. తరువాత అక్కడ స్వల్ప గాయాలైన ఉద్యోగులను స్ట్రెచర్‌లో తీసుకొచ్చి ప్రథమ చికిత్స చేసే విధానాన్ని కూడా చూపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన అగ్నిమాపక అధికారి బసివిరెడ్డి, ఏపీ ఫైర్‌ ఎమర్జెన్సీ సర్వీసు జిల్లా యంత్రాంగం, పెద్దపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌ రెడ్డి, హెచ్‌పీసీఎల్‌ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం చిత్తూరు రోడ్డులోని జవహర్‌ నవోదయ విద్యాలయంలో 2024–25 సంవత్సరానికి 9, 11 తరగతుల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయ ప్రిన్సిపాల్‌ గోవిందరావు తెలిపారు. అక్టోబర్‌ 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 9వ తరగతిలో ప్రవేశానికి 2009 మే 1, 2011 జులై 31లోపు జన్మించినవారు అర్హులన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 8వ తరగతి చదువుతున్న వారై ఉండాలన్నారు. 11వ తరగతిలో చేరాలనుకునే వారు విద్యార్థులు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి చదువుతూ ఉండాలన్నారు. 2007 జూన్‌ 1, 2009 జులై 21 మధ్య జన్మించి వుండాలన్నారు. ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో వన్‌టైం సెటిల్‌మెంట్‌ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన ఫీజు చెల్లించే గడువును ఈనెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ డా. జి. రవీంద్రనాథ్‌ తెలిపారు. 2015, 2016, 2017, 2018, 2019 సంవత్సరాలలో తృతీయ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక్కో సబ్జెక్టుకు రూ. 1000 చొప్పున ఫీజు చలానా ద్వారా చెల్లించాలని కోరారు.

హిందీభాషపై పట్టు సాధించాలి

కడప ఎడ్యుకేషన్‌ : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు హిందీభాషపై పట్టుసాధించాలని కార్పొరేటర్‌, మిట్టా శ్రీదేవి పేర్కొన్నారు. బుధవారం చెమ్మియాపేట బాలికల హైస్కూల్లో రాష్ట్రీయ భాష ప్రచార సమితి వార్త సొసైటీ ఆధ్వర్యంలో హిందీ మెటీరియల్‌ను విద్యార్థులకు ఉచితంగా అందచేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

వీరబల్లె (రాయచోటిటౌన్‌) : ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జిల్లా పరిషత్‌ చైర్మన్‌ ఆకేపాటి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వీరబల్లె మండల పరిధిలోని గడికోట పంచాయతీ యడపల్లెలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్‌ క్లినిక్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు గ్రామంలోని ప్రతి ఇంటికి వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు మీ ఇంటి వద్దకే వస్తున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఎక్కడైనా ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాని వారు అర్హులై ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. ప్రతి పేదవాడికి కార్పొరేట్‌ వైద్యం అందేవిధంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అలాగే వేల్పులమిట్టలో వేల్పుల శ్రీరాములు అనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తను పరామర్శించి వైద్య రక్ష పథకం ద్వారా సదుపాయాలు కల్పించాని అక్కడే ఉన్న వైద్యాధికారులకు సూచించారు. సమీపంలోని అంగన్‌ వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమాల్లో వీరబల్లె ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ శివరాం గౌడ్‌, తహసీల్దార్‌ మహేశ్వరరెడ్డి, ఎంపీడీఓ మల్లీశ్వరి, ఈఓపీఆర్‌డీ రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గాలివీటి వీరనాగిరెడ్డి, నాగూరు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్‌ ఆకేపాటి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

రాయచోటిటౌన్‌ : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నదే భారత ప్రధాని నరేంద్రమోదీ ధ్యేయమని బీజేపీ రాజంపేట పార్లమెంటరీ అధ్యక్షుడు సాయి లోకేష్‌ అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలో రాయచోటి అసెంబ్లీ కన్వీనర్‌ అరమాటి శివగంగిరెడ్డి ఆధ్వర్యంలో నారీ శక్తి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

మెరిట్‌ విద్యార్థులకు సత్కారం

రాజంపేట టౌన్‌ : ఈ ఏడాది టెన్త్‌ పబ్లిక్‌ పరీక్షలో మండలంలోని తుమ్మల అగ్రహారానికి చెందిన మిట్టపల్లి సౌజన్య 576 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మండల టాపర్‌గా నిలిచింది. అలాగే ఇంటర్‌ పరీక్షల్లో ప్రభుత్వ జూనియర్‌ కళాశాలకు చెందిన ఉప్పలపాటి సాయిశివకార్తీక్‌ (ఎంపీసీ) 964 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచారు. వీరికి వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని సరస్వతీపురం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు రిటైర్డ్‌ డిప్యూటీ డీఈఓ మునగాల కృష్ణకుమార్‌, రిటైర్డ్‌ హెచ్‌ఎం ఏ.శంకర్‌రాజు చేతుల మీదుగా విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను సత్కరించి నగదు ప్రోత్సాహాన్ని అందచేశారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో మంచి మార్పునకు దోహదపడగలవని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.



విద్యార్థిని, తల్లిదండ్రులను సత్కరిస్తున్న రిటైర్డ్‌ డిప్యూటీ ఈఓ, రిటైర్డ్‌ హెచ్‌ఎం

ప్రయాణం.. ప్రమాదకరం

ఓబులవారిపల్లె : మండలంలోని బొమ్మవరం గ్రామం ప్రధాన రహదారి ఇరువైపులా రైతులు మట్టి తోలడంతో ఆ మార్గంలో ప్రయాణించే వారికి ప్రమాదంగా మారింది. శేశక్కగారిపల్లె గ్రామ సమీపంలో రోడ్డు మలుపు వద్ద ఇరువైపులా ఎత్తుగా తోలిన మట్టి రోడ్డుపైకి రావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గం గుండా ప్రతి నిత్యం బొమ్మవరం, బీపీరాచపల్లె తదితర గ్రామాలకు వాహనదారులు ప్రయాణిస్తుంటారు. ప్రమాదాలు జరుగుతాయని భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని మట్టిని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


బొమ్మవరం గ్రామ ప్రధాన రహదారిపై రోడ్డుకు ఇరువైపులా ఎత్తుగా తోలిన మట్టి

ఓటర్లకు అనువుగా పోలింగ్‌ కేంద్రాలు

మదనపల్లె : నియోజకవర్గంలో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు, పోలింగ్‌శాతం పెరిగేందుకు వీలుగా ఓటర్లకు అనువైన ప్రాంతాల్లో పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్డీఓ ఎం.ఎస్‌.మురళి అన్నారు. స్థానిక సబ్‌కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో బుధవారం అన్ని రాజకీయపార్టీలు, ఏఈఆర్వోలు, సూపర్‌వైజర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని మూడు మండలాలు, ఒక మున్సిపాలిటీలో పోలింగ్‌స్టేషన్స్‌ ఏర్పాటుపై దృష్టి సారించినట్లు తెలిపారు. మదనపల్లె పట్టణంలో ఒకే ప్రాంతంలో 11 పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయని, ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు 3కి.మీ.లకు పైగా రావాల్సి వస్తోందన్నారు. దీంతో పోలింగ్‌శాతం తగ్గిపోతోందని అన్ని రాజకీయపార్టీల అభ్యర్థన మేరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దాదాపు 31 పోలింగ్‌స్టేషన్‌లలో ప్రజలు నివసించే ప్రాంతంలో కాకుండా వేరేచోటకు వెళ్లి ఓటుహక్కు వినియోగించుకోవాల్సి వస్తున్నట్లు ఇంటింటి సర్వేలో గుర్తించామని తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు 1350 మంది ఓటర్లకు మించి ఉన్న పోలింగ్‌ కేంద్రాలను రెండుగా చేసేందుకు జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపనున్నట్లు ఆయన పేర్కొన్నారు.